ప్రజాశక్తి

ఆదివారం 5 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆర్థిక బలోపేతం.. ఉపాధి కల్పన

- పెట్టుబడుల సదస్సు లక్ష్యమిదే : సిఎం జగన్, మంత్రి అమర్‌నాథ్
- ప్రభుత్వంపై నమ్మకంతోనే పెట్టుబడులు వచ్చాయని ఉద్ఘాటన
- రెండో రోజు రూ.1.17 లక్షల కోట్లతో 260 ఎంఒయులు
- విశాఖలో ముగిసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023



సమ్మిట్ విజయవంతమైనట్లు ప్రకటిస్తూ అభివాదం చేస్తున్న సిఎం జగన్, చిత్రంలో కిషన్‌రెడ్డి, అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించామని సిఎం జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రపంచం నలుమూలల నుంచీ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ నెల 3న ప్రారంభమైన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023' శనివారంతో ముగిసింది.

ఈ సందర్భంగా జరిగిన సభలో తొలుత సిఎం మాట్లాడుతూ రెండు రోజులూ కలిపి రూ.13 లక్షల కోట్ల ఎంఒయులపై సంతకాలు జరిగాయన్నారు. రెండో రోజు 1.17 లక్షల కోట్లతో 260 ఒప్పందాలు చేసుకున్నామని, తద్వారా 30,787 మందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కాబోతుందని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతమైనట్లు ప్రకటించారు. అనంతరం రూ.3841 కోట్ల విలువైన 14 పారిశ్రామిక యూనిట్లను సిఎం సమ్మిట్ వేదికపై పారిశ్రామిక ప్రతినిధుల సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. దీని వల్ల 9108 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. సమ్మిట్‌లో మిగతా 2లో..



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రత్నకుమారి, వేదికపై మహిళా సంఘాల నేతలు

మహిళా గొంతు వినిపించే

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

ప్రొఫెసర్ రత్నకుమారి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శాసన మండలిలో మహిళా అంశాలపై చర్చ జరిగేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని రిటైర్డ్ ప్రొఫెసర్ రత్నకుమారి పిలుపునిచ్చారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జగదాంబ దరి ప్రజా సంఘాల కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యాన 'చట్టసభల్లో మహిళల పాత్ర' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ మిగతా 2లో..

700వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

వార్త మెయిన్‌లో..

ఆర్థిక బలోపేతం.. ఉపాధి కల్పన


పారిశ్రామిక వేత్తలతో సిఎం జగన్

(మొదటి పేజీ తరువాయి..) కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శర్బానంద్ సోనోవాల్ పాల్గొన్నారు. ఎపికి కేంద్రం సహకారం నిరంతరం ఉంటుందన్నారు.

సదస్సు ముగింపు సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ సమ్మిట్‌తో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించామన్నారు. ప్రతి ఒప్పందాన్నీ ఆచరణాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తామని, వాటి ద్వారా అందే ప్రయోజనాలను రాష్ట్ర ప్రజలకు అందిస్తామని తెలిపారు. ప్రధానంగా 14 రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించామని, దీనికి అన్ని దేశాల నుంచి ఆశించిన మేర స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ఇయు కూటమి దేశాల నుంచి అధిక సంఖ్యలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారని గుర్తు చేశారు. యుఎఇ, నెదర్లాండ్స్, వియత్నాం, ఆస్ట్రేలియా దేశాల మొదలు మొత్తం 40 దేశాలకు చెందిన 595 మంది ప్రతినిధులు పరోక్షంగా పాల్గొన్నారని చెప్పారు. సదస్సు నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, తీవ్ర కృషి చేశామని, దీనికి తగిన ఫలితం దక్కిందని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, పారిశ్రామికవేత్తల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు నిర్వహిస్తామని, వీలైనంత త్వరగా నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, సమాచార శాఖ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

పలు అంశాలపై సెమినార్లు

రెండో రోజు పలు అంశాలపై సెమినార్లు నిర్వహించారు. పెట్రోలియం అండ్ ఫార్మాస్యూటికల్స్, హయ్యర్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, టెక్స్‌టైల్ అండ్ అపెరల్స్‌తోపాటు వెస్టన్ ఆస్ట్రేలియా వంటి కంట్రీ సెషన్స్ కూడా నడిచాయి.

కళకళలాడిన ఎపి పెవిలియన్ స్టాల్స్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన స్టాళ్లను వీక్షించడానికి వ్యాపార వేత్తలు, విద్యార్థులు ఆసక్తి చూపించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, శ్రీ సిటీ, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, మోరి టెక్, సిఐఐ ఇన్నైడర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, ఆప్కో హ్యాండ్లూమ్స్, లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డ్, జిసిసి స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

అప్రమత్తమైన అధికారులు

తొలిరోజు జరిగిన అనుకోని సంఘటనల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం రెండో రోజు అప్రమత్తమైంది. తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. భోజన ఏర్పాట్లు సజావుగా ఉండేలా నిర్వాహకులు చూశారు.


ప్రతినిధులు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

రెండో రోజు తగ్గిన వ్యాపారవేత్తల హాజరు

రెండో రోజు సమ్మిట్‌లో వ్యాపారవేత్తలు కరువయ్యారు. మొదటి రోజు కనిపించిన హడావుడి రెండో రోజు లేదు. ప్రధాన గ్యాలరీలోని సీట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. సచివాలయం వాలంటీర్లు, విద్యార్థులు, ఉద్యోగులతో మిగిలిన సీట్లను నిర్వాహకులు నింపేశారని కొందరు ప్రతినిధులు బాహటంగానే చెప్పారు.

పారిశ్రామిక ప్రదర్శనను తిలకించిన బుగ్గన

రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎపి పెవిలియన్ పారిశ్రామిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ స్టాల్‌లో ప్రదర్శించిన పలు యుద్ధ హెలీకాప్టర్లను పరిశీలించారు. సంస్థ కార్యక్రమాలు, సైనిక దళాల అవసరాల కోసం తమ సంస్థ చేస్తున్న కృషిని జనరల్ మేనేజర్ అరుణ్ జే సర్కటే మంత్రికి వివరించారు. హెచ్ఎఎల్ సంస్థ తరుపున జ్ఞాపికను అందజేశారు. శ్రీ సిటీ స్టాల్‌లో అక్కడ తయారవుతున్న పారిశ్రామిక ఉత్పత్తులపై ఎమ్‌డి రవి సన్నారెడ్డి ఆర్థిక మంత్రికి వివరించారు.


నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి..) సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని దశాబ్దాలుగా మహిళా సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నాయేగానీ అమలు కావడం లేదన్నారు. ప్రముఖ న్యాయవాది జహేర మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం కాదు.. 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎ.విమల మాట్లాడుతూ మహిళా, ప్రజా సంఘాలు బలపరుస్తున్న రమాప్రభను గెలిపించడం ద్వారా ప్రజా సమస్యల చర్చకు అవకాశమిచ్చినవారిమవుతామన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ విశాఖ జిల్లాలోని బాల బాలికలను పాతికేళ్లుగా చైతన్యం చేస్తున్న రమాప్రభ శాసన మండలికి వెళితే ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేసే అవకాశముంటుందని తెలిపారు. సదస్సులో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, నాయకులు వై.సత్యవతి, బి.పద్మ, రమణి, యుటిఎఫ్ నాయకులు ఉమాదేవి, శ్రామిక మహిళా సంఘం నాయకులు సీత, ఇందీవర, సూర్యప్రభ, విమల, కుమారి, రంగమ్మ, సంతోషం పాల్గొన్నారు.

అరకు, లంబసింగి పర్యాటకానికి రూ.75 కోట్లు

- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో గుర్తింపు పొందిన అరకు, లంబసింగిలకు భారత్ దర్శన్ పథకంలో భాగంగా రూ.75 కోట్లును కేంద్రం మంజూరు చేసిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇదే పథకం కింద అన్నవరం, శ్రీశైలం, అమరావతి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కూడా అల్లూరి 125వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రిలో సంగీత నాటక అకాడమీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎపిలో కుటుంబ రాజకీయాలు ప్రజలకు నష్టం చేస్తున్నాయన్నారు. రాజకీయ నాయకులు అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సాగాలి తప్ప కక్ష సాధింపులు, ప్రతీకారాలతో పొద్దు పుచ్చరాదన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ పర్యవేక్షణలో బీచ్ రోడ్‌లోగల బ్రిడ్జి స్కూల్ ఆవరణలో మహిళలకు స్వయం ఉపాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొవ్వొత్తుల తయారీ, పినాయల్, సర్ఫ్ తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. అందుకు ఇటువంటి స్వల్పకాలిక శిక్షణలు తోడ్పడతాయని తెలిపారు. ఇక్కడ తయారైన వస్తువులను సగం ధరకే విక్రయిస్తున్నట్టు తెలిపారు. 15 ఏళ్లుగా మహిళలు, బాలల అభ్యున్నతికి నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ ప్రతినిధి వెంకట రమణ, హోమియో డాక్టర్ మోటూరి శివరామకృష్ణ, హరగోపాల్, నరసింహారావు, బి.సూర్యనారాయణ, శ్రీలక్ష్మి, రమణి కుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి అచ్యుతరామరాజు శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు, కళా ప్రపూర్ణ, కీర్తిశేషులు గణపతిరాజు అచ్యుతరామరాజు శత జయంతి వేడుకలను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు అచ్యుతరామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మత్స జగన్నాథరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ ప్రారంభ కార్యక్రమం ఉంటుందన్నారు. సభకు కథ, కవిత, నవలా రచయిత, తమ సమాఖ్య అధ్యక్షురాలు లలితా వాశిష్ట అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సెంచూరియన్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

11న నూతన చిత్రానికి నటీనటుల ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : న్యూస్ వన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న నూతన చిత్రానికి ఈ నెల 11న నటీనటుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు చిత్ర దర్శకులు అవినాష్ పూజారి తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగించే చిత్రం నిర్మించాలని భావించామన్నారు. సమావేశంలో డైరెక్టర్ జిఎల్.జయసింహ, ఎ.సోమేశ్వరరావు, రవితేజ, ఎపి మా ప్రతినిధి వై.అప్పారావు, స్వరూప్ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE COURT AT VISAKHAPATNAM
A.S. 12 / 2020

Between :
Thatisetti Srinivasa Rao ...Appellant
And:
Veerarapu Rama Namam ...Respondent

NOTICE BY WAY PUBLICATION

To,
Respondent:
Veerarapu Rama Namam,
S/o. Suryanarayana, Hindu, aged 31 years, Residing at FF-1 Indumathi Residency, Murali Nagar, Visakhapatnam.

Please take notice that in the above Appeal in A.S. 12/2020 filed by the appellant in the above said court, which is against decree passed by Hon'ble VI Addl. Senior Civil Judge in O.S. 1199/2014, and the same was stands posted to **28-03-2023** for your appearance, and you should attend before the Honourable Court either personally or through an advocate on the above mentioned dated at about **10-30 A.M.** failing which the matter will be decided in your absence.

(By Order of the Court)
M.S.MADHAV
Advocate
Visakhapatnam

Visakhapatnam
Dt. 04-03-2023

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నర్సీపట్నం
Dispute No. 257/2014 E.P.No. 12/2017
E.A.No. 119 / 2022

బిట్వీన్:
శ్రీరామచిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సీపట్నం బ్రాంచ్, Rep. by its G.P.A. Holder / సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.కిరణ్‌కుమార్, తండ్రి రామకృష్ణ ... వాది / DHR
అండ్:
జె.రమేష్ వగైరాలు ... JDRS

బహిరంగ ప్రకటన

పై E.A.119/2022 లో JDRS (2) పోన్నూరు పి.మాణిక్యలరావు, తండ్రి లేటు మట్టయ్య (3) Karri Ravi, S/o. Late Simha chalam (4) Panasa Satyanarayana, S/o. Late Kassulu లపై శ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో డబ్బులు వసూలు నిమిత్తం E.P.No. 12/2017 E.A.119/2022 దాకలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు ఇచ్చినప్పటికీ కోర్టుకు హాజరుకాలేదు. కాబట్టి చివరగా కోర్టు వారు పై E.A.119/2022 లో **తేది: 10-03-2023న ఉదయం 10 గం॥** సమయంలో హాజరు కావాలని ఆదేశించినారు. లేనియెడల కోర్టు వార తదుపరి చర్యలు తీసుకోగలరని గమనించవలెను.

కె.శ్రీనివాసరావు, ఎస్.రామలక్ష్మి
అడ్వకేట్స్, శ్రీ రామ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సీపట్నం.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి నర్సీపట్నం వారి కోర్టు
E.A.No. 173 / 2022 E.P.No. 152/2014
in Dispute No. 37/2012

బిట్వీన్:
శ్రీరామచిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సీపట్నం బ్రాంచ్, Rep. by its G.P.A. Holder / సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.కిరణ్‌కుమార్, తండ్రి రామకృష్ణ ... వాది / DHR
అండ్:
పి.రాజశేఖరమ్ వగైరాలు ... JDRS

బహిరంగ ప్రకటన

పై E.A.173/2022 in E.P. 152/14 లో JDR నెం. 2 అయిన బి.జోగారావు, తండ్రి లక్ష్మణరావులపై శ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో డబ్బులు వసూలు నిమిత్తం E.A.173/2022 in E.P. 152/2014 దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు ఇచ్చినప్పటికీ కోర్టుకు హాజరుకాలేదు. కాబట్టి చివరగా శ్రీ కోర్టు వారు పై E.A.173/2022 లో **తేది: 24-03-2023న ఉదయం 10 గం॥** సమయంలో కోర్టుకు హాజరుకావాలని ఆదేశించినారు. లేనియెడల కోర్టు వారు తదుపరి చర్యలు తీసుకోగలరని గమనించవలెను.

కె.శ్రీనివాసరావు, ఎస్.రామలక్ష్మి
అడ్వకేట్స్, శ్రీ రామ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నర్సీపట్నం.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II, AT: VISAKHAPATNAM
E.A.33/2019 in C.C.80/2017

Between:
Sri C.V.S.L. Raju ... D.Hr
And|˜Ÿ
M/s. Chaffinch Traveller Joint, Rep. by its Proprietor ... J.Dr

NOTICE

To,
M/s. Chaffinch Traveller Joint,
Rep. by its Proprietor:
Smt. J. Sashikala Mohanty, aged 50 years, D.No.103-104, 1st Floor, Dutt Island, Siripuram, Visakhapatnam-3

Please take notice that the D.Hr herein filed the above application under Sec.200 Cr.P.C. for the offence punishable under Sec.27 of the Consumer Protection Act, 1986, praying this commission to execute the orders passed against you, in C.C.80/2017 dated 19-05-2017. The same stands posted to **15-03-2023** for your appearance and therefore, you are hereby called upon to appear before this Hon'ble Commission on the above said date at **10:30 A.M** either in person or through your Advocate and if you failed to appear before the Hon'ble Commission on the above said date and time, the matter will be decided ex-parte.

(By Order of the Hon'ble Commission)
G. M. REDDY,
Advocate, Visakhapatnam,
Cell: 9849113617.

IN THE HON'BLE COURT OF THE VII SPECIAL MAGISTRATE, AT: VISAKHAPATNAM
C.C.2909/2022

Between:
Sabbi Appa Rao ...Complainant
And:
Pyla Gowri Madhusudhana Reddy ...Accused

NOTICE

To,
Accused:
Pyla Gowri Madhusudhana Reddy, S/o. Narasinga Rao, Hindu, Aged 52 years, R/at D.No.38-92-221/8, ASRR Nagar, Kancharapalem, Visakhapatnam-8.

Please take notice that the complainant filed the case praying the Hon'ble Court to punish you under Sec.138 of the Negotiable Instruments Act. The same stands posted to **15-03-2023** for your appearance. Therefore, you are hereby called upon to appear before the Hon'ble Court on the above said date at **10:30 A.M,** either in person or through a Pleader. In default of your appearance, the Hon'ble Court will issue non-bailable warrant to secure your presence.

(By Order of the Hon'ble Court)
G. M. REDDY,
Advocate
Visakhapatnam-13,
Cell: 9849113617.

ప్రజలను మోసగించేందుకే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ఆంధ్ర ప్రజలను మోసగించేందుకే విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు తెరలేపారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో విధ్వంసాలకు, కూల్చివేతలకు, పారిశ్రామికవేత్తలను బయటకు తరిమివేసే కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. ఏడాదిలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు సమ్మిట్ల పేరుతో కపట నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.

2017లో చంద్రబాబు నాయకత్వాన విశాఖపట్నంలో అంతర్జాతీయ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరుగుతుంటే ప్రత్యేక హోదా ఉత్తరాంధ్ర ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ అంటూ ఆ సదస్సును దెబ్బకొట్టాలని ప్రయత్నించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎంఒయులు చేసుకున్న లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్స్, జాకీ, అదానీ డేటా సెంటర్‌ను వెళ్లగొట్టారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రంతో జగన్మోహన్‌రెడ్డి లాలూచీపడ్డారని ఆరోపించారు. 770 రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు, నిర్వాసితులు తీవ్ర ఆందోళనలు చేస్తుంటే ముఖ్యమంత్రికి పట్టడంలేదు సరికదా నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ సభ్యులను శుక్రవారం నిర్బంధించడం ప్లాంట్‌పై ఆయనకున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుచ్చ విజయ్‌కుమార్, ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, ముత్యాల నాయుడు, పులి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

గంజాయి రవాణాలో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కశింకోట

గంజాయి అక్రమ రవాణా కేసులో మరో ఇద్దరు నిందితులను మండలంలోని తాళ్లపాలెం జంక్షన్‌లో అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 1వ తేదీన మండలంలోని కన్నూరుపాలెం వద్ద ఆటోలో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం విధితమే. ఆ కేసుకు సంబంధించిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అనకాపల్లి రూరల్ సిఐ రవికుమార్ అందిన సమాచారం మేరకు కశింకోట పోలీసులు శనివారం తాళ్లపాలెం జంక్షన్‌లో టివిఎస్ బైక్‌పై వస్తున్న నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన మాకిరెడ్డి రాజశేఖర్, రోలుగుంట మండలం ఎమ్.కొత్త పట్నం గ్రామానికి చెందిన జన శ్రీనును అరెస్టు చేశారు. వారిని కోర్టుకు తరలించారు. వారి నుండి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -ములగాడ : గాంధీగ్రామ్‌లోని ఇఎస్‌ఐ హాస్పిటల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... పెదగంట్యాడ ఐటిఐకి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై మల్కాపురం వైపు నుంచి సింధియా వెళ్తుండగా ఇఎస్‌ఐ హాస్పిటల్ సమీపంలో యూ టర్న్ తీసుకుంటున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు, మరొక విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. యువకులు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన కౌశిక్, మోహన్, నాగేంద్రలుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన ముగ్గురికి ఇఎస్‌ఐ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, అనంతరం కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమునిపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపల్ యు.ముత్యాల నాయుడు మాట్లాడుతూ, ఆంగ్ల బోధనలో నవ్యతను, నూతన అభ్యసన విధానాలను అవలంబించి, మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. బోయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా బావాజీ వ్యవహరించారు. ఈ శిక్షణకు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

రుషికొండ బీచ్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం : రుషికొండ బీచ్‌లో ఆనందపురం పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 55 మందికి వైద్య చికిత్సలు జరిపారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పర్యటక ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా ఆనందపురం పిహెచ్‌సి ఆధ్వర్యాన రుషికొండ బీచ్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, పిఎన్‌హెచ్.కృష్ణవేణి, సిహెచ్‌ఒలు కె.లావణ్య, బి.జస్వంత్, పర్యాటక శాఖ జాయింట్ మేనేజర్ వెంకటేష్‌వర్లు, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతుని వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ఈ ఏడాది నూతనంగా కన్నయ్య కోనేరులో ఆదివారం నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి కె.రాంబాబు, ఆలయ ఇఒ ఎస్.నానాజీబాబు కోరారు. సుమారు 60 సంవత్సరాలు తర్వాత ఈ ఏడాది తెప్పోత్సవాన్ని పునరుద్దరిస్తున్నట్లు తెలిపారు. తెప్పోత్సవం కోసం కన్నయ్య కోనేరులో పది రోజులుగా తుప్పలు తొలగించి బాగు చేశారు. బోర్లు సహాయంతో కోనేరును నీటితో నింపారు.



తెప్పోత్సవానికి సిద్ధం చేస్తున్న భక్తులు

ప్రమాదాల నివారణకు ప్రణాళిక అవసరం

ప్రజాశక్తి -తగరపువలస : అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర విపత్తులు, అగ్నిప్రమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్.సంజయ్ సూచించారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్‌లో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల నివారణకు అవసరమైన శిక్షణ అవసరమన్నారు. ముందుగా కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన ర్యాలీని రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్ని మాపక శాఖ డైరెక్టర్ పి.వి.రమణ ప్రారంభించారు. ఏర్పాటు చేసిన భద్రతా పరికరాల ప్రదర్శను అగ్నిమాపక శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల అడిషనల్ డైరెక్టర్ జి శ్రీనివాసులు ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన అత్యవసర వాహనాలు, పరికరాల కేంద్రాన్ని రాష్ట్ర విపత్తులు, అగ్ని మాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్.సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జె మోహనరావు, దివీస్ డైరెక్టర్ మధుసూదనరావు, ఉపాధ్యక్షులు ఎస్.దేవేందర్‌రావు, ఎల్‌వి రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్.కోటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎంఎస్ఎన్.రావు, భద్రతా విభాగపు సిబ్బంది ఎం.చంద్రశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

గాయత్రిలో విశ్వజ్ఞ 2కె23 ప్రారంభం



గాయత్రిలో జరిగిన విశ్వజ్ఞ 2కె23లో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల (ఎ) నందు విశ్వజ్ఞ 2కె 23ని స్టీల్‌ప్లాంట్ ఎజిఎం జగన్నాధపాత్రో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో కెరీర్‌ను నిర్మించడానికి సాంకేతిక విశ్వజ్ఞ సామర్థ్యం, ప్రవర్తనా సమగ్రత, నైతిక విలువలు కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్‌లలో విద్యార్థుల ప్రతిభను పురస్కరించుకుని రెండు రోజుల నుంచి విశ్వజ్ఞ టెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి పి.సోమరాజు తెలిపారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ వివిఎస్ఆర్‌కె.ప్రసాద్, డివిఎస్.కామేశ్వరరావు, పి.రాజగణపతి, జివిపిజిబి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజని, డైరెక్టర్ ప్రొఫెసర్ బివి.రమణమూర్తి, విభాగాధిపతి ప్రొఫెసర్ పి.జ్యోత్స్నాదేవి సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ విజయాలలో కెరీర్ అవకాశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా హిందూ క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రంపై గెలుపొందిన జివిపిసిడిపిజిసి క్రికెట్ జట్టును ఘనంగా సత్కరించారు. గీతం యూనివర్సిటీ, ఎంవిజిఆర్ కళాశాల, రఘు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎల్.బుల్లయ్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం'

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని రైల్వే సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. వాల్తేరు అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ప్రాజెక్ట్, కన్స్ట్రక్షన్) శ్రీనివాస్‌తో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో గల ఏడు వార్డుల్లో సమస్యలను పరిశీలించి తదుపరి కార్యాచరణపై చర్చించారు. ప్రధానంగా 56వ వార్డు ఆర్‌పి.పేట అండర్ బ్రిడ్జి యొక్క రోడ్డు, డ్రైనేజీ మరమ్మతులు, చాకలిగెడ్డ తయానంద్‌నగర్ రైల్వే ట్రాక్ మధ్య ప్రజల రాకపోకలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని కోరారు. 57వ వార్డు పరిధి సుభాష్ నగర్‌లో అండర్ బ్రిడ్జి రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం, శ్యామ్‌నగర్‌లో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలపై చర్చించారు. భరత్‌నగర్ నూకాలమ్మ గుడి వద్ద రైల్వే స్థలంలో డ్రైనేజీ పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. 89వ వార్డు పరిధి చంద్రనగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ విస్తరణలో భాగంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించి తగు న్యాయం చేయాలన్నారు. 90వ వార్డు పరిధి గవరవీధి రైల్వే ట్రాక్‌ను అనుకుని ఉన్న ప్రధాన కాలువకు అంచనా వ్యయం, 91, 92 వార్డుల పరిధి బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ అంబేద్కర్ విగ్రహం నుంచి శ్మశానం వెనుక నుంచి సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డుకు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం, బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ రైల్వే స్థలంలో నివాసం ఉన్నవారికి, గోపాలపట్నం జువ్వాలమ్మ కాలనీలో ఉంటున్న వారికి నివాస అనుమతిని కల్పించాలని కోరారు. శ్రీరామ్ నగర్ రైల్వే స్థలంలో డ్రైనేజీకి, వెంకటాపురం నుంచి నరవ మధ్యలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్టు ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి స్థలంలో ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది సర్వేనెంబర్ 224/1 లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని ఆర్ అండ్ బి అధికారులకు గ్రామానికి చెందిన రైతులు బుగత వెంకటరమణ, కనకల శ్రీను శనివారం ఫిర్యాదు చేశారు. మద్ది గ్రామానికి చెందిన వెన్ని అప్పారావు, మరి కొంతమంది రైతులు ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కెజిబివి పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు, విజయానందపురంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం పద్మనాభం మండల అధ్యక్షులు రాలి అప్పారావు అధ్యక్షతన కెజిబివి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్ట్ జె.రమేష్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. చదువుపై శ్రద్ధ, మానసిక ధైర్యం, పరీక్షల్లో విజయం, బాలికల వికాసం తదితరాలపై వివరించారు. ఈ కార్యక్రమములో పాఠశాల సిబ్బంది, ఆర్ఎంపి వైద్యులు ఎంవి.రమణ, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని విజయానందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు భీమిలి డైట్ అధ్యాపకులు సరిపల్లి త్రినాధ్ ప్రేరణ కలిగించారు. పదికి పది పాయింటు సాధించేందుకు మెళకువలు, మానసిక స్థితి మెరుగునకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు సరిత, రాజరాజేశ్వరి, ఉమాదేవి, పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో స్వీకరించాలి

ప్రజాశక్తి-కంచరపాలెం : హయ్యర్ పెన్షన్ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో కూడా అనుమతించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్‌చేసింది. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశంలో శనివారం హష్మీ భవన్‌లో నిర్వహించారు. పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. ప్రధానంగా సుప్రీంకోర్టు తీర్పు వల్ల, ఇపిఎఫ్ సర్క్యులర్ వల్ల వచ్చిన గందరగోళం నివారించాలని, గ్యాస్ ధరను తగ్గించాలని, జివిఎంసి ఇంటి పన్నుతో పాటు చెత్త పన్ను వసూలు చేయడం అపాలని తీర్మానించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొరెడ్ల రమాప్రభను అసోసియేషన్ మెంబర్స్ అందరూ బలపరచి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, ఆమె గెలుపునకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 19న కాకినాడలో జరిగే ఎపిఆర్ పిఎ రెండవ రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని కోరారు.

న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలి

ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ స్వతంత్రత ఆయువుపట్టు అని, దాన్ని కాపాడుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 'భారత న్యాయవ్యవస్థ స్వతంత్రత -సవాళ్లు' అనే అంశంపై ఐలు రాష్ట్ర కమిటీ, విశాఖపట్నం జిల్లా కమిటీల ఆధ్వర్యాన శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన్ కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడటంలో ప్రజాసంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు తమవంత్రు పాత్ర పోషించాలన్నారు. సమావేశానికి విశిష్ట అతిథిగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవివిఎస్.శర్మ, ఐలు విశాఖ కమిటీ అధ్యక్షులు బివి.రామాంజనేయరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.ఆనందరెడ్డి, నూకల వెంకటేశ్వరరావు, భగత్ తులసీదాస్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కోరెడ్ల రమాప్రభ తదితరులు ప్రసంగించారు. ఇటీవల కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఉప రాష్ట్రపతి కొలీజియం ఉద్దేశించి అనేక అంశాలపై ప్రతిపాదించడం తీవ్ర గర్హనీయమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తుల నియామకం కొలీజియం కాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుంటే భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతిని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ప్రతినిధులు ముక్తకంఠంతో ఉద్ఘటించారు. ఉద్యోగ విరమణ పొందిన న్యాయమూర్తులకు పదవులు ఇవ్వడం వంటివి కూడా స్వతంత్రతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వేదికపై శర్మ తదిరులు



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ప్రయివేటు పాఠశాలల ప్రతినిధులు

సమస్యలపై మంత్రి బొత్సకు వినతి


ప్రజాశక్తి-గాజువాక, విశాఖపట్నం : ప్రయివేటు పాఠశాలల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇస్తున్న మాదిరిగానే నర్సరీ నుంచి యుకెజికి కూడా పర్మిషన్ ఇవ్వాలని, విద్యా హక్కు చట్టం ద్వారా ఇచ్చే 25 శాతం ఫ్రీ సీట్ల విషయంలో ప్రభుత్వం ప్రకటించే ఫీజు సరిపోదని, దాన్ని పెంచాలని, పదో తరగతి సైన్స్ పరీక్షలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పాఠశాలలకు పదేళ్ల కాలానికి గుర్తింపు ఇవ్వాలని వినతిలో కోరారు. వీటిపై మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ నర్సరీ నుంచి యుకెజి పర్మిషన్‌కు డిఇఒ స్థాయిలో పర్మిషన్ ఇచ్చేలా చూస్తానని, గుర్తింపు ఐదేళ్ల కాలానికి ఇస్తామని, పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్, విశాఖ జిల్లా అధ్యక్షులు జె.సోమశేఖర్, జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, బి.శ్రీనివాస్, మురళిసుందర్, గణపతిరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గాజువాక : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టూ వీలర్ మెకానిక్ గొల్లపల్లి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రగతి టూ వీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలిచింది. మృతుని భార్య నాగమణికి అసోసియేషన్ సభ్యులు రూ.45,200 శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి మాట్లాడుతూ, తమ సంఘం సభ్యుల సంక్షేమంతో పాటు ఆపద సమయంలో ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదర్‌రావు, ప్రతినిధులు వంగపండు గణేష్, రెడ్డిపెల్లి రాజు, సమ్మిడి పైడిరాజు, బి.శ్రీనివాసరావు, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైనది న్యాయవ్యవస్థ

హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ ఎంతో శక్తివంతమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు అన్నారు. పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అన్నిటికన్నా బలమైనదన్నారు. న్యాయ సమీక్ష గురించి పలువులు న్యాయవాదులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. అనేక కీలక అంశాల్లో న్యాయవ్యవస్థ తీర్పులను ప్రస్తావించి సహజ న్యాయం అనే భావనను తెలియజేశారు. కొన్ని రాజ్యాంగ సవరణలను ఉదహరించారు. ప్రాథమిక హక్కులు రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమన్నారు. బ్యాంకుల జాతీయకరణ, భారత ఉదాంతం తదితర విషయాల్లో రాజ్యాంగ చట్టాలు, న్యాయనిపుణులు వ్యాఖ్యానించిన తీరుతెన్నులను ప్రస్తావించారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ గమనాన్ని క్షుణ్ణంగా వివరించారు. రాజ్యాంగ నియంత్రణలో శాసన, కార్యనిర్వహాక, న్యాయవ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శి డిఎస్.వర్మ, న్యాయవాదులు, గ్రంథాలయ సిబ్బంది, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రిని కలిసిన ఆడారి ఆనంద్‌కుమార్, పివి సురేష్

ముఖ్యమంత్రిని కలిసిన సురేష్

ప్రజాశక్తి -ములగాడ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ -2023కి విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆడారి ఆనంద్‌కుమార్‌తో 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అభ్యసనాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థుల అభ్యసనాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివరాణి పేర్కొన్నారు. చినగదిలి మండల ఆంగ్లోపాధ్యాయులకు శనివారం ఇక్కడి ఉన్నత పాఠశాలలో పలు అంశాలపై అవగాహన కల్పించారు.

టెక్నికల్ ప్రాక్టీస్, లిప్‌పై స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు నాగేశ్వరరావు ఉపాధ్యా యులకు వివరించారు. పదో తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌లో ఏ విధంగా అధిక మార్కులు సాధించవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెఎ.బాలామణి, డిఆర్‌పి ఎన్.సోమ యాజులు, ఆర్పీలు యోగేశ్వరరావు, ఆల్బర్ట్, అప్పారావు, సిఆర్‌పి జివి.శివదయాళ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : త్యాగాలు, బలిదానాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 751వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించదగ్గవే అయినా 32 మంది త్యాగాలు, బలిదానాలతో సాధించిన, రూ.లక్షల కోట్ల ఆస్తులు కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోవాల్సిన అవసరం ఉందా?, పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా ప్లాంటును నడిపిస్తే వేలాది ఉద్యోగాలు ఇవ్వచ్చన్న సంగతి మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి విశాఖ ఉక్కును నష్టాలు బారిన నెట్టకుండా ఆపాలని, ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఏళ్ల తరబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సొంతగనులు కేటాయించాలని, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బకొట్టి మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తున్న యాజమాన్యం పోకడలను నిలువరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి చెయ్యాలని డిమాండ్‌చేశారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, ఎన్.రామారావు, సిహెచ్.సన్యాసిరావు, డి.శ్రీనివాస్, బి.అప్పారావు, మొల్లి వెంకటరమణ, కోరి అవతారం, జగ్గారావు మంత్రి గోపి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న కార్మికులు, పోరాట కమిటీ నాయకులు

ఉగాదికి గృహ నిర్మాణాలు పూర్తి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఉగాది నాటికి జిల్లాలో జగనన్న ఇళ్ల లేఅవుట్లలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఆయన అచ్యుతాపురం మండలం కొల్లివానిపాలెంలో పర్యటించారు. అక్కడ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం గృహ నిర్మాణంలో అనకాపల్లి జిల్లా ముందు వరసలో ఉందన్నారు. గృహ నిర్మాణ శాఖ కృషి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో ఉంచాలని సూచించారు. గృహ నిర్మాణానికి ఎటువంటి చిక్కులు ఏర్పడకుండా నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. అవసరమైన మౌలిక వసతులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిశీలన

మండలంలో ఏపీ ఎంఐపి వారు చేస్తున్న మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద సాగవుతున్న భూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, బిందు సేద్యాలను గూర్చి రైతులకు సంపూర్ణమైన అవగాహన కలిగించి పంటలకు ఏ విధంగా ఉపయోగ పడుతుందో వివరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి, అచ్యుతాపురం తహశీల్దారు వై శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీఓ వై వెంకటేశ్వరరావు, నర్మల రామకృష్ణ, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి బిల్లులు : డిపిఒ

ప్రజాశక్తి-వడ్డాది

జగనన్న ఇళ్ల లేఅవుట్లలో వేగవంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి ఆదేశించారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసిన వారికి విద్యుత్ లైన్లతో పాటు ఉచిత విద్యుత్ మీటర్లను కూడా అందిస్తామని తెలిపారు. అనంతరం లోపూడి అంగన్వాడీ కేంద్రం-1ను సందర్శించారు. పిల్లల వివరాలను, లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహార గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. తరువాత వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలలో భాగంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అంబేద్కర్, హౌసింగ్ ఏఈ, సచివాలయ కార్యదర్శి సతీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హర్ష తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకుంటున్న డిపిఒ శిరీషరాణి



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రబీ పంటలతో రైతులకు లాభాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రబీ సీజన్లో రైతులు అపరాలు, నువ్వులు, మొక్కజొన్న, కూరగాయల వంటి పంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించి లాభాలు పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జూబ్లీ హాల్‌లో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి దాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించేందుకు, ఖర్చు తగ్గించేందుకు గ్రామస్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో జీడి, మామిడి, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భవాని, ఆర్ఎఆర్ఎస్ చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి చిత్కలాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ కెవి రమణమూర్తి, డాక్టర్ ఎం విశాలాక్షి, ఆదిలక్ష్మి, ఆర్ సరిత, చంద్రశేఖర్, సీతారామలక్ష్మి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో కొత్త కల్లాలు దగ్గర అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు శనివారం రూ.5 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రామానాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రజలను మోసగిస్తున్న వైసిపి ప్రభుత్వం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ

గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ పేరుతో వైసిపి ప్రభుత్వం ఆంధ్ర ప్రజలను మోసం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. గతంలో టిడిపి ప్రభుత్వం కూడా ఇలాగే సమ్మేట్లు నిర్వహించి మోసం చేసిందని, టిడిపి, వైసిపి రెండూ దొందూ దొందేనని మండిపడ్డారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడున్నరేళ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేయని వైసిపి ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ పేరుతో హడావుడి చేస్తుందని పేర్కొన్నారు. సుమారు రూ.100 కోట్లు ఖర్చుపెట్టినట్టు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రకటన చేయించిన వైసీపీ ప్రభుత్వం, హోటళ్ల అద్దెలు, వంటకాలు, గిఫ్ట్‌లకు ఎంత వెచ్చించారో వారికే తెలియాలని ఎద్దేవా చేశారు. ఒకపక్క సమావేశం జరుగుతుండగానే గిఫ్ట్‌లను అధికార పార్టీ కార్యకర్తలు పట్టుకెళ్ళిపోయారన్నారు. పెట్టుబడుల పేరుతో వందలాది ఎకరాలను కంపెనీలకు దోచి పెట్టేందుకు వైసిపి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. విశాఖలో ఏ రాజధాని లేకున్నా సముద్రతీరం కారణంగా భారీ పరిశ్రమలు వచ్చాయని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి భారీ పరిశ్రమల సాధించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అప్పుడే భారీ ఉపాధి సాధ్యమన్నారు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇస్తే పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రత్యేక హోదా గురించి రాష్ట్ర ప్రభుత్వం వినతి పత్రాలు ఇవ్వడం తప్ప కార్యచరణ ఏమీ లేదని విమర్శించారు.

నేడు కర్రి పార్వతమ్మ సంతాప సభ

ప్రజాశక్తి-అచ్యుతాపురం



మహిళా ఉద్యమ నేత కీర్తిశేషులు కర్రి పార్వతమ్మ సంతాప సభ మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని వారి కుటుంబీకులు తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు చేశారు. పార్వతమ్మ జీవిత విశేషాలు, పోరాట సంఘటనలు, సేవా కార్య క్రమాలు స్ఫూర్తిదాయకమని అభిమానులు తెలిపారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం వడ్డాది నాగవల్లి శ్రీవెంకటేశ్వరస్వామి 150వ కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక నరసింగరావుపేటలోని ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు స్వగృహంలో శనివారం కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎంవిఆర్ తనయుడు ముత్యాల సతీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ అన్న సమారాధనకు పది బస్తాల బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ముత్యాల సతీష్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి-సబ్బవరం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఎపి రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అమృతపురం గ్రామంలో అనకాపల్లి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న అధ్వర్యంలో విదేశీయులు శనివారం పర్యటించారు. ఈ బృందంతో టి.విజయ్‌కుమార్, సత్య త్రిపాఠి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ విదేశీ ప్రతినిధులకు, ఎపిసిఎన్ఎఫ్‌కు అవసరమైన ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ముడి పదార్థాలు ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, కాషాయాలు, మీనామృతం పంచగవ్య మొదలైన వాటిగురించి వివరించారు. అనంతరం సూర్యమండలం మోడల్ గురించి మరియు సారవత్రిక సూత్రాలు గురించి వివరించారు. పిఎండిఎస్ వలన కలిగే ప్రయోజనజనాలు గురించి తెలియజేశారు. అనంతరం వరి పంటలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతు లగుడు చిన్నమ్ముడుతో మాట్లాడి ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. విదేశీ ప్రతినిధులకు మహిళా సంఘాలతో ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా ముందుకు తీసుకోని వెళ్తున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సి కృష్ణారావు, ఆర్టిఓ హేమ సుందర్, గ్రామ సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు, గ్రామ సెక్రటరీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



నమూనా ద్వారా ప్రకృతి వ్యవసాయ గురించి విదేశీయులకు వివరిస్తున్న దృశ్యం



పూజలో పాల్గొన్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

వెంకటేశ్వరస్వామి పండగ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని కింతాడ పంచాయతీ శివారు గంగాభవాని పాలెం గ్రామంలో కుబిరెడ్డి కుటుంబీకుల ఇలవేల్పు శ్రీవెంకటేశ్వర స్వామివారి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు ఇందులో పాల్గొని దేవుడి ఇంటిలో వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాలను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, కుబిరెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

అనకాపల్లి : స్థానిక దేమునిగుమ్మంలోని స్వయంభు శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఆలయ అర్చకులు పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో ఎదురు సన్నాహం, కల్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదినారాయణ, అర్చకులు విజయ్ బాబు, ప్రసాద్ బాబు, రాజేష్ బాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డిఎంఒ దొర

మామిడిపల్లి సబ్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం పీహెచ్సీ పరిధిలోని మామిడిపల్లి సబ్ సెంటర్‌ను డీఎంవో దొర శనివారం పరిశీలించారు. అనంతరం ఆ సెంటర్ పరిధిలో ఏ రకమైన వైద్య సేవలు అందిస్తున్నారో ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది కాబట్టి వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ప్రజలకు వివరించాలని సబ్ సెంటర్ ఏఎన్ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రమణ, ఎంపిహెచ్ఏ ఆర్ఏ.మూర్తి, సురేష్, ఏఎన్ఎం కె.విజయలక్ష్మి, ధనలక్ష్మి, ఆశా కార్యకర్త ఎన్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారించాలి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని వేసవిలో నీటి ఎద్దడి నివారించాలని మండల ప్రత్యేక అధికారి మోహన్ రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మంచినీటి పైపులు, బోర్లు పర్యవేక్షణ చేయాలని సూచించారు. 10-19 సంవత్సరాలు నిండిన బాలికలలో రక్తహీనత సమస్య అధికంగా ఉన్నందున పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కొంకి అప్పారావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు

లిక్విడేటర్ నియామకంపై నిరసన

నైతిక బాధ్యతగా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ అమ్మకానికి పెట్టేందుకు లిక్విడేటర్‌ను నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ తక్షణమే రాజీనామా చేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. లిక్విడేటర్ నియామకానికి వ్యతిరేకంగా అఖిలపక్షాల ఆధ్వర్యాన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ముందు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీపై 13,500 రైతు కుటుంబాలు, వందలాది కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. రైతులతో సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా ప్రభుత్వం లిక్విడేటర్‌ను ఎలా నియమిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ తమతోనే సాధ్యమని 2019 ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి, గుడివాడ అమర్నాథ్ పలుమార్లు ప్రకటించారని, నేడు అందుకు విరుద్ధంగా ఫ్యాక్టరీని విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. లిక్విడేటర్ నియామకాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు విల్లూరి పైడారావు, శ్రీరామదాసు గోవింద, దూలం గోపి, మల్ల శ్రీను, తాడి రామకృష్ణ, కనుబుడ్డి నరసింగరావు, అప్పికొండ గణేష్, దామోదర్, వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకర్రావు, కోన దుర్గ, కనిశెట్టి సురేష్ బాబు, పవన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో జరిగిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 13,251 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 16,236 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. వీరిలో మొదటి సంవత్సరం 2,549 మంది, ద్వితీయ సంవత్సరం 2,262 మంది ఒకేషనల్ విద్యార్థులన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలను రెవెన్యూ, పోలీస్, లెక్చరర్లతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లు ఏర్పాటు, నిరంతర విద్యుత్తు సరఫరా, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ పరీక్ష సమయంలో బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రీజినల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ ఉమారాణి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుజాత, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ బి.రాధ, జోనల్ కమిషనర్ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఆర్టీసీ డిపో మేనేజర్, డిప్యూటీ డిఈవోలు పాల్గొన్నారు.

జిఐఎస్‌లో రాష్ట్ర పరువు తీశారు

టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌ను వైసిపి కార్యకర్తల సమావేశంలా నిర్వహించి రాష్ట్రం పరువు తీశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు భోజనాలు దగ్గర సృష్టించిన గందరగోళం పారిశ్రామికవేత్తలను నివ్వెర పోయేలా చేసిందన్నారు. పారిశ్రామికవేత్తలకు కేటాయించిన సీట్లలో కార్పొరేషన్ల చైర్మన్లను కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మరోసారి మోసగించేందుకు మూడున్నర ఏళ్ల తర్వాత వందల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి ఇటువంటి ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. టిడిపి హయాంలో కుదిరిన ఒప్పందాలను, వచ్చిన పెట్టుబడులను తరిమేసి ఇప్పుడు లక్షల కోట్ల రూపాయల ఎంఒయులు కుదిరాయని చెప్పడం దారుణమన్నారు. పారిశ్రామికవేత్తల చేత కూడా అబద్ధాలు చెప్పించడం జగన్‌కే చెల్లిందన్నారు. గిఫ్ట్ ప్యాకుల కోసం వైసిపి కార్యకర్తల తోపులాట, కౌంటర్లు ధ్వంసమైన తీరు పారిశ్రామిక వేతలతో పాటు రాష్ట్రానికి మాయని మచ్చగా మారిందన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేస్తామని చెప్పడం పారిశ్రామికవేత్తలను, ఉత్తరాంధ్ర ప్రజలను మరోసారి మోసగించడం అవుతుందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు మల్ల గణేష్, బుద్ధ భువనేశ్వర్ రావు, సాలాపు నాయుడు, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - కశింకోట

జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి మోహనరావు ఆదేశించారు. మండలంలోని అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో హౌసింగ్ లే అవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపిడిఓ కొంకి అప్పారావు, కార్యదర్శి మహేష్. లబ్ధిదారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గం ఎన్నికల అధికారి ప్రమీలాగాంధీ

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి-చోడవరం

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శనివారం ఎన్నికల రికార్డ్స్ తనిఖీ చేయడానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం నియోజకవర్గంలో చోడవరంలోనే చాలా తక్కువ అయిందని తెలిపారు. మండలాల వారీగా చూస్తే ఇప్పటి వరకు రోలుగుంట మండలంలో 41 శాతం, రావికమతం 55 శాతం, బుచ్చయ్యపేట 51 శాతం, చోడవరం 35 శాతం నమోదైందని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుండడంతో సిబ్బంది కొరత ఉందన్నారు. ముందుగా చనిపోయిన వారు, దూర ప్రాంతాల్లో స్థిర పడ్డవారు, పెళ్లి అయి వెళ్లిపోయిన వారు, డబుల్ ఎంట్రీలను గుర్తిస్తామని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు తమ ఇంటికి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ విడి, విడిగా తమ ఆధార్ కార్డు/ పాన్/ డ్రైవింగ్ లైసెన్స్/ బ్యాంక్ అకౌంట్ తదితర వాటితో తమ స్థానికతను నిరూపించుకుని, ఓటర్ కార్డుకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ రిజిస్టర్‌లో సంతకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ఎల్.తిరుమల బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-వడ్డాది

వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి 150వ కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా భక్తులకు మూడు పూటలా అల్పాహారం, అన్నదానం చేస్తున్నారు. దాతల సహకారంతో శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారు భక్తులకు అన్నదానం చేశారు. రెండవ రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు వనదేవీశ్వరస్వామి కల్యాణ మహోత్సవం


ప్రజాశక్తి- దేవరాపల్లి

మండల కేంద్రంలోని శారద నది పంట కాలువను ఆనుకొని ఉన్న వనదేవీశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు, గౌరి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి, మహా పరమ శివలింగాన్ని దర్శించుకోవాలని కోరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న గంటా

ప్రజాశక్తి-కసింకోట

కశింకోట వెలంపేట శ్రీగౌరీ పరమేశ్వరులను మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్బారావు, మళ్ళ సురేంద్ర, ఉగ్గిన రమణ మూర్తి, కోట్నీ బాలాజీ మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, డిసిసిబి మాజీ డైరెక్టర్ సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, నైనంశెట్టి రమణారావు, తాకాశి కృష్ణ, జెర్రిపోతల నూకినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గౌరీపరమేశ్వరుల సన్నిధిలో మాజీ మంత్రి గంటా తదితరులు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

పనిచేసే చోటే కుప్ప కూలిన నూకమ్మ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదతీనార్ల గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మేరుగు నూకమ్మ గుండెపోటుతో మృతి చెందింది. గ్రామంలో కొండపై ఉపాధి పనులు జరుగుతున్నాయి. శనివారం ఉదయం నూకమ్మ తోటి ఉపాధి కూలీలతో కలిసి పని చేసేందుకు కొండపైకి వెళ్ళింది. పని ప్రారంభించిన కొద్దిసేపటికే ఆమె పనిచేసే చోట కుప్ప కూ లిపోయింది. వెంటనే తోటి కూలీలు సపర్యలు చేపట్టి ,స్థానిక ఎంపీటీసీ సభ్యులు ఎం.నాగేశ్వరరావుకు సమాచారం ఇవ్వడంతో హుటా హుటినా ఆయన 108కు ఫోన్ చేసి సమాచారం అందించి కొండపైకి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు. తోటి కూలీలంతా నూకమ్మ మృతదేహాన్ని కొండపై నుండి కిందకు తీసుకువచ్చారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. భర్త గతంలో మృతి చెందినట్లు కూలీలు తెలిపారు. సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశామని ఎంపీటీసీ తెలిపారు.



కొండపై నుంచి మృతదేహాన్ని కిందకి తీసుకు వస్తున్న ఎంపిటిసి (ఇన్‌సెట్‌లో రోధిస్తున్న కూలీ)



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక అంగన్వాడి కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపి ఆర్‌డి వెంకటనారాయణ తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. సెంటర్‌లో రక్తహీనత లోపించిన గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడి టీచర్‌కు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఐరన్ టాబ్లెట్స్ ఆమె ప్రతి రోజు తీసుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరసూర్యచంద్ర

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఈ నెల 14న మచిలీపట్నం వేదికగా జరిగే జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జనసైనికులు సన్నద్ధం కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం. నియోజకవర్గ ఇన్చార్జ్ రాజా వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన జనసేన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వాన్ని 2024లో ఇంటికి పంపడమే లక్ష్యమని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతమైందని, అన్ని ప్రాంతాల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అద్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు కర్రి సురేష్, కర్రి సంతోష్, సలాదుల ప్రసాద్. బైన మురళి, మారిశెట్టి రాజా, కొత్తకోట రామశేఖర్, కొప్పాక కళ్యణ్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, విద్యతోపాటు నైతిక విలువలు, క్రీడల్లో రాణించాలని కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా అన్నారు. పాయకరావుపేట పట్టణంలోని కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మెరిట్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కే.గాంధీ వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మేనేజర్ అలెక్సా, పిటి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు



హరిని సన్మానిస్తున్న వైసిపి నేతలు

వైసిపి స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షులు

హరికి ఘన సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి: వైసిపి స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి అప్పారావు (హరి)ని శనివారం నక్కపల్లిలో వైసిపి నేతలు ఘనంగా సన్మానించారు. ఉపమాక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి హరి ఇటీవల వైసీపీ విద్యార్థి వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు పాపారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, పార్టీ నాయకులు మని రాజు, కొల్లాటి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ

ప్రజాశక్తి -కోటవురట్ల: సచివాలయం సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. శనివారం ఆమె పాములవాక సచివాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ నిర్మాణాలు సందర్శించి నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీ వద్ద మౌలిక వసతుల కల్పన పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆమె మండల కేంద్రంలో సమావేశం వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పియర్ ఇంజనీర్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం, కోనవానిపాలెం గ్రామాల్లో జగనన్న లే అవుట్లను జిల్లా హౌసింగ్ స్పెషల్ అధికారి లక్ష్మీపతి తనిఖీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న గృహ యజమానులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు ఉగాది లోపు పనులు మొదలు పెట్టాలని, లేని పక్షంలో కేటాయించిన స్థలాలను అర్హులకు కేటాయిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టని వారికి నోటీసులు జారీ చేయాలని హౌసింగ్ ఇంజనీర్లకు తెలిపారు. ఆయన వెంట ఎంపిడివో రామచంద్ర మూర్తి, తహశీల్దార్ శ్యామ్ కుమార్, యుఆర్‌డి సత్యనారాయణ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి: వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలోని ఉపమాక గ్రామంలో జగనన్న లే అవుట్‌ను శనివారం ఆయన సందర్శిం చారు. ఇంటి నిర్మాణం పనులను పరిశీలిం చారు. లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటికే ఇంటి నిర్మాణాలు చాలా ఆలస్యం అయ్యాయని, త్వరతగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ



పుస్తకాన్ని ఇస్తున్న వైద్యులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానికంగా పలు ప్రాంతాల్లో యోగా క్లాసులు నిర్వహించిన యోగా గురువు ఉపేంద్ర సాయి గురూజీ నర్సీపట్నం ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎక్కల రామకష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ, కరోనా తర్వాత ప్రతి ఒక్కరిలో అవయవాల పనితీరు దెబ్బతిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యంకు ప్రతి ఒక్కరికి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగం అని అన్నారు.ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అందించాలనే సంకల్పంతో ఈనెల 5న ఆదివారం సాయంత్రం 6గంటలకు శారద నగర్‌లో ఉచిత పరిచయ కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. 6వ తేదీ నుండి ప్రారంభమయ్యే యోగ శిక్షణ తరగతులకు పేరు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి మాట్లాడుతూ, విద్యార్థినిలు ర్యాంగింగ్‌కు భయ పడకుండా ఎదిరించాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేసారు. బాల్య వివాహాలను అరికట్టాలని పేర్కొన్నారు. న్యాయమూర్తి మధుసూదన్ రావు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి లీలావతి

పలు గ్రామాల్లో పశువులకు టీకాలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో పశువులకు గాలి కుంటు వ్యాధి సోక కుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు పశువైద్య శాఖ ఏడీ సింహాద్రప్పుడు తెలిపారు. మావకరపాలెం, తామరం, రాచపల్లి, కొత్తపాలెం, జి.కోడూరు గ్రామాల్లో 130 పశువులకు గాలి కుటు వ్యాధి నివారణ టీకాలు శనివారం వేశారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సహాయకులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి కల్యాణం జరుపుతున్న పండితులు

ఘనంగా వెంకన్న కల్యాణం

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో కోదండరాయుడు కల్యాణం రమణీయంగా జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన వేడుక శనివారం తెల్లవారుజాము వరకు జరిగింది. ఆలయ కల్యాణవేదిక వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, పండితులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, నర్సింహాచార్యులు, సత్యనారాయణాచార్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా కిటకిట లాడింది. కల్యాణోత్సవానికి ముందు రథోత్సవం నిర్వహించారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల

సమస్యలను పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల విద్యాశాఖ అధికారిని సాయి శైలజకు మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘ జిల్లా అధ్యక్షురాలు కే.ప్రసన్న ఆధ్వర్యాన వినతి పత్రాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ, మధ్యాహ్నం భోజన కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించి, వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైతే పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో వంట చేస్తుండగా అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందిన కార్మికురాలు మలిపెద్ది రమాదేవి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేసి, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు.మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుంది తప్ప సామాజిక భద్రత పెన్షన్లు ఇవ్వలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుకు పాఠశాలలో వంటషెడ్లు, పాత్రలు, మంచినీరు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

వాలంటీర్ సేవాగుణం

- విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి -రావికమతం: అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతున్న ఇద్దరు పెన్షన్ దారులకు గ్రామ వాలంటీర్ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందించి సేవా భావాన్ని చాటుకున్నారు. మండలంలో కవగుంట గ్రామ పంచాయతీకి చెందిన ప్రగడ అర్జున, చేపూరి సూర్యలకు వాలంటీర్ పరవాద రమణ విశాఖకు వెళ్లి పింఛను సొమ్మును అందజేశాడు. వాలంటీర్‌ను గ్రామ సర్పంచ్ దాసరి సూర్య కుమారివరహాలు అభినందించారు.



పింఛను ఇస్తున్న వాలంటీర్

రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు అధ్యక్షులు అయోధ్యరామ్

ప్రజాశక్తి -యంత్రాంగం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని పలు ప్రజా సంఘాల నేతలు కోరారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో రమాప్రభను గెలిపించాలని ప్రచారం చేపట్టారు.

ఉక్కునగరం: డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన ప్లాంట్‌లోని సిఎంఎస్ గేథరింగ్ పాయింట్ వద్ద ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ అవసరాల కోసం పరిమితంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. పోస్కోకు వ్యతిరేకంగా చలో అమరావతి పేరుతో సుమారు 2000 మంది ఉక్కు కార్మికులు ధర్నా నిర్వహిస్తే స్థానిక శాసన సభ్యులు, స్థానిక శాసనమండలి సభ్యులు పాల్గొనలేదని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రం నేరుగా అసెంబ్లీ నుంచి విచ్చేసి తమ సంఘీభావాన్ని తెలియజేశారని గుర్తు చేశారు. కనుక స్టీల్‌ప్లాంట్‌కు కష్టం వస్తే కార్మికులతో కలిసి ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి చేసే అభ్యర్థులను గెలిపించుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరాజు, నాయకులు డి.కృష్ణమూర్తి, నీలకంఠం, యు.వెంకటేశ్వర్లు, కెవి.సత్యనారాయణ, మొహిద్దీన్, సూర్యనారాయణ, డి.సత్యనారాయణ, డిఎస్ఆర్‌సి.మూర్తి, వీరాస్వామి, రాజు, శ్రీరామచంద్రమూర్తి, డి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఉత్తరాంధ్ర సమస్యలపై మంచి పట్టు ఉండి, ప్రజా గొంతును వినిపించే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ శనివారం సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీ, ఎన్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురంలో పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేస్తూ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.నరేంద్రకుమార్, బిసి.నాయుడు, వి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ శనివారం అచ్యుతాపురంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కార్యదర్శి కె సోమినాయుడు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. కోరెడ్ల రమాప్రభకు తొలి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ముంచింగిపుట్టు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నర్సయ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శనివారం గిరిజన సంఘం, భాష వాలంటీర్ల సంఘం నాయకులు, యువతతో కలిసి పిడిఎఫ్ అభ్యర్థి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కె.నర్సయ్య, మండల వైస్ ఎంపీపీ-1 పి.సత్యనారాయణ లు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గొంతు వినిపించాలంటే 250 ప్రజా సంఘాలు బలపర్చిన కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజన సంఘం నాయకులు పి.భీమరాజు, పి.రాందాస్, దొంబ్రు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మండలంలోని కొండల అగ్రహారంలో బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు ప్రచారం చేశారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ప్రశ్నించే వ్యక్తికే పార్టీలకు అతీతంగా ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, చంద్రరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



మాకవరపాలెంలో చేపడుతున్న ప్రచారం

ఊరకనే రారు..మదుపరులు..!



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, వందల సంఖ్యలో అవగాహనా ఒప్పందాలు, లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు... ఇంకొంచెం ముందుకెళితే వందలు, వేల ఎకరాలను పారిశ్రామిక వేత్తలకు ఆ పేరుతో కట్టబెట్టడం వంటి పనులు పాలకులకు కొత్తేమీ కాదు. గత ప్రభుత్వ హయాంలోనూ రాష్ట్రంలో రూ.లక్షల కోట్లు ఇలా ప్రవాహం పొంగిపొర్లింది. క్షేత్రస్థాయిలో చూస్తే ఎంఒయుల అమలు గగనంగా మారింది. 'కొనడం, అమ్మడం ప్రాథమికంగా సమాజ వ్యతిరేకమైన పనులు' అని ఎడ్వర్డ్ బెల్లామి అనే అమెరికన్ రచయిత, జర్నలిస్టు, రాజకీయ క్రియాశీలి వ్యాఖ్యానిస్తారు. మన పాలకులకు ఈ మాటలు సరిపోతాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖ వేదికగా ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023'ను కొత్త అవకాశాలను తెచ్చి పెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం గొప్ప విషయం. అంతేకాకుండా రూ.38 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఈ సందర్భంగా రెండో రోజు సభా వేదికపై సిఎం వైఎస్ జగన్ ప్రారంభించడం విశేషంగా చెప్పొచ్చు. అయితే రూ.2 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రెండు రోజుల సదస్సులో రానున్నాయని చెబుతూ వచ్చిన ప్రభుత్వం.. అకస్మాత్తుగా రూ.13 లక్షల కోట్ల ఎంఒయులను ఎలా చేయగల్గిందన్న సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది.

గతంలో మాదిరిగా కాకుండా ఎంఒయుల అమలు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 'మోనటరింగ్ కమిటీ'ని కూడా రాష్ట్ర స్థాయిలో నియమిస్తూ సభావేదికగా ప్రకటించారు. ఇవన్నీ బాగానే ఉన్నా... ఈ పారిశ్రామిక పెట్టుబడిదారులు ఊరకనే వస్తారా ? పైన అమెరికన్ రచయిత చెప్పినట్లుగా స్థలాలు కట్టబెట్టడం, ప్రాంతాలను గుత్తంగా అప్పగించడం వంటివి సమాజ వ్యతిరేకమైనవి కావా?. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక ఆర్థిక శక్తిగా ఎదగడానికి కావాల్సిన ఉత్పత్తులను చేస్తుంటే దాన్ని తెగనమ్మేయాలనే కేంద్రంలోని బిజెపి సర్కారు విధానానికి ఈ పెట్టుబడుల సదస్సు వత్తాసు పలికినట్టు కాదా ? అమ్మడం, కొనడం అనేవి సమాజ వ్యతిరేకమైనవన్న వ్యాఖ్యలు రాష్ట్రంలో కనిపిస్తున్న పరిస్థితులకు, ప్రభుత్వాల విధానాలకు సరిగ్గా సరిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే విశాఖలో ముగిసిన పెట్టుబడుల సమ్మిట్‌నూ చూడాలని పలువురు అంటున్నారు. ఎన్‌టిపిసిలో 3 వేల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. అదానీ డేటా సెంటర్ కోసం సుమారు 200 ఎకరాలు సిద్ధం చేశారు. డేటా సెంటర్ కోసం రూ.వేల కోట్ల విలువైన భూములను అత్యంత కారుచౌకగా కట్టబెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అదానీ కోసం భూములను ఏజెన్సీలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. అయితే, రూ.3 లక్షల కోట్ల విలువైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి ప్రైవేటీకరణకు దాసోహం పలకడం అత్యంత దారుణమైన విషయం. ఇకపోతే.. తాజా పెట్టుబడుల ప్రవాహం ఉపాధిని పెంచుతుందా ? లేక భూములకు ఎసరు పెట్టి వనరులను దోస్తుందా ? అన్నది చూడాల్సిందే.

వాసవి సురక్ష పథకంతో బాధితులకు చేయూత

ప్రజాశక్తి-రోలుగుంట: వాసవి క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక వాసవి కుటుంబ సురక్ష పథకం బాధిత కుటుంబానికి చేయూత నిస్తుందని అంతర్జాతీయ వాసవి క్లబ్ డైరెక్టర్ శ్రీనాథు శ్రీనివాసరావు చెప్పారు. రోలుగుంట మండలానికి చెందిన వాసవి క్లబ్‌కు చెందిన సున్న అచ్చిరాజు అనే సభ్యుడు గత ఏడాది డిసెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి వాసవి క్లబ్ సురక్ష పథకంలో భాగంగా రూ.3లక్షల 32 వేల 500 చెక్కును జిల్లా గవర్నర్ పిఎస్ వరహాలరావు అందజేశారు. . ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ పలమర్తి సత్యవరహాలరావు, క్యాబినెట్ సెక్రటరీ శ్రీనాథ్ మధు, రీజినల్ చైర్మన్ నాగేశ్వరరావు, జోన్స్ చైర్మన్ సతీష్, రోలుగుంట క్లబ్ ప్రెసిడెంట్ రమణ, చోడవరం యూత్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కే మణికుమార్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.



చెక్కు ఇస్తున్న ప్రతినిధులు